

కథా కౌముది

# అంతిమ న్యాయం సోమర్సెట్ మామ్

అనువాదంః జాస్తి జవహర్లాల్

వాళ్ళు ముగ్గురూ ఎంతో ఓపికగా తమవంతు కోసం ఎదురు చూస్తున్నారు. ఓపికగా ఎదురు చూడటం వారికి అలవాటైపోయింది. గత మూడు దశాబ్దాలుగా వాళ్ళు చేస్తున్న దదే –

ఈ సమయంకోసం ఎదురు చూడటం! నమ్మకం లేకపోయినా న్యాయం జరుగుతుందన్న ఆశ. ఉవ్విళ్ళూరిస్తున్న వ్యసనాల బాటలో ఎంతో నిగ్రహంతో పయనించి మనసు ముక్కలైనా గర్వంగా తలెత్తుకు తిరగ గలుగుతున్నారు. అందుకు ప్రతిఫలంగా ఇప్పుడు న్యాయాన్ని కోరుతున్నారు. సుదీర్ఘమైన జీవనయానంలో అప్పటి ఆవేశాలకు లొంగిపోయి ఉంటే ఇప్పుడిలా ధైర్యంగా న్యాయస్థానం ముందు నిలబడగలిగేవారా? క్షణిక సుఖాలకోసం జీవితాన్ని శాశ్వతంగా పోగొట్టుకుని ఉండేవారు కదా! అప్పుడు తాము చూపిన నిగ్రహానికి ఇప్పుడు తమను తామే అభినందించుకుంటున్నారు. సుదీర్ఘప్రయాణం ముగిసిన తరువాత దేవదూతలు వచ్చి "అంతిమ న్యాయస్థానంలో మీ వంతు వచ్చింది, రమ్మని" పిలిస్తే ధైర్యంగా భౌతిక ప్రపంచాన్ని విడిచి వారితో వచ్చి న్యాయస్థానంలో నిలబడ్డారు. తాము ఏతప్పూ చెయ్యలేదన్న విశ్వాసమే వారికి ధైర్యాన్నిచ్చింది.

న్యాయస్థానం కిటకిటలాడుతోంది. అప్పుడు భూలోకంలో భీకర యుద్ధం సాగుతున్నది. యుద్ధమంటే మారణహోమమేగదా! వివిధ దేశాల సైనికులు, మిసమిసలాడే యువకులు తమ వేడి రక్తాన్ని ధారపోసి పోరాడి జీవితాన్ని బలిచేసి ఇప్పుడు అంతిమ న్యాయస్థానానికి పయనమయ్యారు. వారి మరణంతో అనాథలైన స్త్రీలు, దిక్కులేని వారైన పిల్లలు దిగులుతో

కృశించి, ఆకలితో, అనారోగ్యాంతో అలిసి బ్రతుకు చాలించిన వారంతా ఇక్కడ అంతిమ న్యాయస్థానంలో న్యాయం కోసం వచ్చారు. ఈ ముగ్గురు కూడా యుద్ధం కారణంగానే అందరితోపాటు ఇక్కడికి వచ్చారు.

జాన్, మేరీ, రూత్ –

ముగ్గురూ ఒక ఓడలో ప్రయాణిస్తున్నారు. యుద్ధసమయం కావటంతో ఒక సబ్మెరీన్ ప్రయోగించిన టార్పెడో దెబ్బకు ఓడ మునిగిపోయింది. భార్య మేరీని రక్షించాలని ప్రయత్నించకపోతే జాన్ బ్రతికి ఉండేవాడు. కాని అది అతనికి ఇష్టం లేదు. ఆమెను రక్షించటం తన ప్రథమ కర్తవ్యంగా భావించాడు. ఐతే అతడామెను మనసారా ప్రేమించాడని అనలేము. నిజానికి ఆమె పైన ఏమాత్రమూ ప్రేమ లేదు. ఐనా భర్తగా అతడెప్పుడూ తన బాధ్యతను విస్మరించలేదు. ఇద్దరూ మృత్యుముఖంలో ఉన్న సమయంలో తనను తాను రక్షించుకోవటం కంటే ఆమెను రక్షించటం తన కర్తవ్యంగా భావించాడు.
తానూ బలయ్యాడు.

జాన్ పట్ల తనకున్న ప్రేమను త్యజించి, అది మరచిపోవటానికి జీవితాన్ని ప్రజోపయోగం కోసం ధారపోసిన రూత్ తన ప్రియుడితో పాటే మునిగిపోయింది. మరణించింది.
ఆ ముగ్గురినీ దేవదూతలు తెచ్చి అంతిమ న్యాయస్థానం ముందు నిలబెట్టారు.
కాలాతీతుడైన న్యాయాధికారి కొంతసేపు వారి ఉనికిని గమనించలేకపోయాడు. అందుకు కారణం అతనికి కలిగిన చీకాకు. అంతకు ముందే ఒక సుప్రసిద్ధ తాత్త్వికుని విచారించాడు. ఆ తాత్త్వికుడు ఆ న్యాయాధికారి మీద తనకేమాత్రమూ విశ్వాసం లేదని ముఖాన చెప్పి వేశాడు. న్యాయాధికారికి చీకాకు కలిగింది. అందుకు రాజాధిరాజు తనలో తానే నవ్వుకున్నాడు. కాని ఆ తాత్త్వికుడు అంతతో ఊరుకోలేదు. భూలోకంలో జరుగుతున్న మారణహోమం గురించి ప్రశ్నించాడు. న్యాయాధికారి అందరూ అనుకుంటున్నట్లు సర్వశక్తిమంతుడు, కరుణామయుడూ ఐతే ఈ మారణహోమం ఎలా సాధ్యమయింది? ఈ దురాగతాన్ని నివారించలేని వాడు సర్వశక్తిమంతుడెలా అవుతాడు? ఒక వేళ శక్తిమంతుడై కూడా ఆపలేదంటే అతడు కరుణామయుడెలా అవుతాడు? ఈ సమస్య సర్వాంతర్యామికి తెలియంది కాదు. ఇంతకు ముందే ఎన్నోసార్లు ఈ ప్రశ్నను ఎదుర్కొన్నాడు. ఐనా ఎప్పుడూ సమాధానం చెప్పాలని ప్రయత్నించలేదు. ఎందుకంటే దేవుడైనా రెండూ రెండూ కలిపితే నాలుగే అవుతుందిగాని ఐదు చెయ్యలేడుగదా! తాత్త్వికులు అటువంటి అవకాశంకోసమే ఎదురు చూస్తుంటారు. హేతుబద్ధమే ఐనా ఆ తాత్త్వికుడు అసమంజసమైన నిర్ణయానికి వచ్చాడు.
"సర్వశక్తిమంతుడూ, కరుణామయుడూ కాని భగవంతుడిని నేను నమ్మను" అని నిష్కర్షగా చెప్పాడు.

అప్పుడు న్యాయాధికారి తన దృష్టిని ఈ మూడు నీడబొమ్మలవైపు తిప్పాడు. సజీవంగా ఉన్నప్పుడు సమయం తక్కువగా ఉంటుందిగనుక ఎక్కువగా మాట్లాడతారు. కాని మరణానంతరం ఆ సమస్య ఉండదు. సమయం అనంతం. అప్పుడు మాట్లాడే

భాష దేవతలకే వినిపిస్తుంది. ఈ ముగ్గురూ తమ అనుభవాలను న్యాయాధికారికి వివరించారు.
జాన్, మేరీ దంపతులు సంతోషంగా కాలం గడుపుతున్నారు. ఐదేళ్ళతరువాత జాన్ కి రూత్ తో పరిచయమయింది. రూత్ జాన్ కన్నా పదేళ్ళు చిన్నది. అందగత్తె. ఆకర్షణీయంగా, ఆరోగ్యంగా జీవితానందాన్ని అనుభవించాలన్న ఉత్సాహంతో ఉరకలేస్తుంటుంది. ఇద్దరూ ప్రేమలో పడ్డారు. అది మామూలు ప్రేమకాదు. ప్రపంచ చరిత్ర పరమార్థమే తమ కలయిక అని వారి ఉద్దేశం. ప్రేమావేశంలో ప్రపంచాన్ని మరచిపోయారు. కొన్నాళ్ళకు ఉరవడి తగ్గింది. నిజానికి వారికి సమాజం పట్ల, ఆచారవ్యవహారాల పట్ల గౌరవం ఉంది. సమాజంలో తమ స్థానమేమిటో వారికి గుర్తు వచ్చింది. తమ అనుబంధం వారికి ఆ వేదన కలిగించింది.

తాను వివాహితుడై ఉండి రూత్ ని ఏవిధంగా ప్రేమించగలడు? అని జాన్ బాధ పడ్డాడు. తాను ఒక వివాహితుడితో ప్రేమలో పడటమేమిటి? అని రూత్ ప్రశ్నించుకుంది. వాళ్ళ వ్యవహారం జాన్ భార్య మేరీకి తెలిసిందని గ్రహించిన తరువాత వారి అపరాధం తెలిసి వచ్చింది. మేరీకి తన భర్త చూపుతున్న ప్రేమ, అభిమానము నిజం కాదని అనిపించింది. భర్తపట్ల ఆగ్రహము, రూత్ పట్ల అసూయ ఆమెను కుదిపివేశాయి. అంతటి ఆగ్రహావేశాలు తనలో ఉన్నయ్యని ఆమెకి అంతవరకు తెలియదు. భర్త తనను వదిలివేస్తాడేమోనన్న భయం పట్టుకుంది. అదే జరిగితే తాను బ్రతక గలదా? అతని మనసుని తానెందుకు గెలుచుకోలేకపోయింది? అందుకు సమాధానంగా రూత్ కోసం తనభర్త ఆరాటపడలేదని, ఆమెయే అతన్ని వలలో వేసుకుందని సమాధానం చెప్పుకుంది. భర్తని నిందించలేదు. తనలో తానే కుమిలి ఏడ్చింది. కన్నీళ్ళలో తడిసింది. ఆమె బాధను చూచి రూత్, జాన్ ఇద్దరూ బాధపడ్డారు. ఈ స్థితిని వారూహించలేదు. వారి ప్రేమావేశంలో వారు మునిగి పోయారు. తెలిసిన తరువాత తప్పు చేశామన్న భావంతో వారు ఆత్మ విమర్శ చేసుకున్నారు. తమనావహించిన దుష్టశక్తుల ప్రభావం నుంచి బయట పడాలని ప్రయత్నం చేశారు. కాని అది అంత తేలిక కాదు. వారి మనసులు అంతగా ఏకమయ్యాయి . ఇప్పుడు విడిపోవాలంటే మనసులను చంపుకోవటమే అవుతుంది. ఎంతో అందంగా, ఆనందంగా వారూహించుకున్న భవిష్యత్తుని మరచి పోవాలి. అదే వారి తుది నిర్ణయం. దురాలోచనలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. తాము నిర్మించుకున్న ఆశాసౌధాలను వారే భగ్నం చేసుకున్నారు. అన్నిటినీ త్యాగంచేసి భగవదర్పితమని సంతోషించారు, తృప్తి పడ్డారు. జాన్ తిరిగి భార్యవద్దకు చేరాడు.

కాని రూత్ కి ఎవరూ లేరు. మళ్ళీ ప్రేమలో పడేటంత ధైర్యం లేదు. తనశక్తినంతా ప్రజోపయోగానికి వినియోగించింది. అనాథులను చేరదీసింది. రోగపీడితులకు సేవ చేసింది. దాన ధర్మాలను వ్యవస్థీకరించింది. తన పట్ల, తన అందం పట్ల నిష్కర్షగా ప్రవర్తించింది. కటువుగా తనను తానే శిక్షించుకుంది. అనాకారిగా మిగిలింది.

జాన్ కి జీవితం పట్ల ఆసక్తి తగ్గిపోయింది. అంతిమ క్షణాలకోసం ఎదురు చూస్తునట్లు బ్రతుకుతున్నాడు. కాని తనకు తెలియ కుండానే భార్య మేరీపట్ల అసహనం పెరగసాగింది. బయటికి మాత్రం ఆమెపట్ల గౌరవంగానే నడుచుకుంటున్నాడు. భర్తగా తన బాధ్యతను నిర్వర్తిస్తున్నాడు. మేరీకి మాత్రం భర్తపట్ల అభిమానం తగ్గలేదు. మరొక స్త్రీని ప్రేమించినందుకు అసహ్యించు

కోలేదు. కాని తనకోసం భర్త ఏదో త్యాగం చేశాడన్న భావం కలిగినప్పుడు మాత్రం ఆమెలో కోపం కలుగుతుంది. అతనికి బాధ కలిగించే విధంగా మాటలంటుంది. అందుకు తనను తానే నిందించుకుంటుంది. అతడు చేసిన త్యాగం తాను మాత్రం చెయ్యలేదా? తనను బాధపెట్టి తాను సుఖించాలనుకోవటమేమిటి? చాలాసార్లు తాను చచ్చిపోతే బాగుండుననుకుంటుంది. అవన్నీ అప్రస్తుత విషయాలు. రుచి, పచి లేని జీవితం ఐపోయింది. ఇప్పుడు అంతిమ తీర్పుకోసం ఎదురుచూస్తున్నారు. స్వర్లోక న్యాయస్థానాలలో నిశ్శబ్దం ఆవహించింది.

సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు, కరుణామయుడు ఐన న్యాయాధికారి న్యాయపీఠం మీద కూర్చుని తనలో తానే చర్చించుకుంటున్నాడు. అనంతమైన సముద్రజలాల అలలమీద ఉదయించే భానుని కిరణాలు మిరుమిట్లు గొలపాలని నేనాశించింది ఇందుకేనా? ఆకాశాన్నందుకునే పర్వతశిఖరాలమీద తెల్లని, చల్లని మంచు కిరీటాలు కప్పాలని ఆదేశించింది ఇందుకేనా? సాయంకాలపు పిల్లతెమ్మెరలలో పచ్చని పైరులు తలలూపాలని కోరింది ఇందుకేనా? తానేదో ఆలోచించాడు, చేశాడు. కాని ఫలితం ఇలా ఉందేమిటి? అని ఆశ్చర్యపోతున్నాడు.
చివరికి "బజారుప్రక్క మురికి గుంటలో ప్రతిబింబించినట్లు నక్షత్రాలు ఇంకెక్కడా ప్రతిబింబించవు" అన్నాడు.
అతని ముందు నిలుచున్న ఆ మూడు నీడలవంక చూచాడు. తమ కథనాన్ని వినిపించిన తరువాత తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు. వారి జీవితాలు సంకటమయమే! ఐనా వారు తమ బాధ్యతను సవ్యంగానే నిర్వర్తించారు. తాను తీర్పు చెప్పాలి. ఒక్కసారి "ఉఫ్ఫ"ని ఊదాడు, సిగరెట్టు కాల్చుకున్న తరువాత అగ్గిపుల్లని ఆర్పినట్లు. అతని ముందున్న ముగ్గురూ మాయమైపోయారు. అది న్యాయాధికారి నిర్ణయం.

"అక్రమ లైంగిక సంబంధాలకు నేనంత ప్రాముఖ్యతనిస్తానని ఎందుకనుకుంటారో నాకు అర్థం కాదు. నా చర్యలన్నిటినీ గమనిస్తే నేను ఈ విధమైన మానవబలహీనతలకు సానుభూతి చూపుతానన్న విషయం అవగతమవుతుంది." అన్నాడు. ఆ తరువాత అక్కడే ఉన్న తాత్త్వికుని వైపు తిరిగాడు. అతని ప్రశ్నకు సమాధానం చెప్పాలిగదా!

"చూస్తున్నావుగదా? నేను నా సర్వశక్తులనూ కరుణతో జోడించాను. ఔనా?" అన్నాడు.

★★★

COMMENTS